# రైతులను అవమానించిన పీసీసీ చీఫ్

- యావత్ తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పాలి
- ఆంధ్రపాలకుల మన్ననల కోసం ఇంకాపాకులాడడం సిగ్గుచేటు
- రైతు మహోత్సవ వేడుక.. చంపినోడే సంతాపసభ పెట్టినట్లు ఉన్నది
- మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



మోర్తాడ్, ఏప్రిల్ 21: వ్యవసాయ రంగంలో నిష్ణాతులైన తెలంగాణ రైతులను అవమానించిన పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ వెంటనే యావత్ తెలంగాణ సమాజానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ రైతులకు ఆంధ్రప్రాంతం వారు వ్యవసాయం నేర్పించారని పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలపై వేముల ఘాటుగా స్పందించారు. పీసీసీ చీఫ్ చేసిన వ్యాఖ్యలతో యావత్‌తెలంగాణ సమాజాన్ని అవమాన పరిచినట్లేనని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులను అరిగోస పెడుతున్న కాంగ్రెస్ సర్కారు, రైతు మహోత్సవ వేడుకలు జరుపుకోవడం చంపినోడే...సంతాపసభ పెట్టినట్లు ఉన్నదని ఎద్దేవా చేశారు. కేసీఆర్ చెప్పేది అక్షరసత్యమని, బీఆర్ఎస్‌కు తప్ప, తెలంగాణ మీద ప్రేమ ఏ రాజకీయపార్టీకీ ఉండదని పేర్కొన్నారు. తెలంగాణ కాంగ్రెస్ నాయకులు తీవ్ర భావదారిద్ర్యంలో ఉన్నారని, ఆంధ్ర పాలకుల మన్ననల కోసం ఇంకా పాకులాడడం సిగ్గుచేటని విమర్శించారు. తెలంగాణ వ్యవసాయ చరిత్ర తెలియని వ్యక్తులు, తెలంగాణకు పాలకులు కావడం ప్రజల దౌర్భాగ్యమని పేర్కొన్నారు. ఆంధ్రలోని కోస్తా ప్రాంతం లో వరి తప్ప ఏదీ పండించరని, కానీ తెలంగాణలో వరితో పాటు వాణిజ్య పంటలైన పత్తి, పసుపు, చెరుకు, మిర్చి, మక్కజొన్న లాంటి పంటలు పండిస్తారని తెలిపారు. పల్లి, శనగ, పెసర, కందులు, మినుములు లాంటి ఆహారధాన్యాలు పండిస్తారని, వెయ్యేండ్ల క్రితమే దక్కన్ ప్రాంతంలో సన్నబియ్యం పండించిన చరిత్ర తెలంగాణ రైతులదని గుర్తు చేశారు.

**బీఆర్ఎస్ రజతోత్సవ వేళ పార్టీలో** సరికొత్త జోష్ నెలకొన్నది. కొంతకాలంగా పార్టీలోకి వలసలు జోరుగా కొనసాగుతున్నాయి. ఇతరపార్టీల నేతలు గులాబీ కండువా కప్పుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. మొన్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి సమక్షంలో ఇతర పార్టీల నుంచి నాయకులు స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌లో చేరారు. అంతకు ముందు కామారెడ్డిలో మాజీ ప్రభుత్వ విప్ సారథ్యంలో బీఆర్ఎస్‌లో పలువురు చేరారు. అర్బన్ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా సమక్షంలో మైనార్టీ నాయకులు గులాబీ కండువా కప్పుకున్నారు. ఇటీవల బాన్సువాడలో ఎమ్మెల్సీ కవిత సమక్షంలో పలువురు బీఆర్ఎస్‌లో చేరగా.. బాల్కొండ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ సర్పంచులు, ఎమ్మెల్యే వేముల సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా బీఆర్ఎస్ పురుడు పోసుకుని 25 వసంతాలు కాగా, ఏప్రిల్ 27న ఆవిర్భావ దినోత్సవానికి వరంగల్ జిల్లాలో ఘనంగా ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. రజతోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు సిద్ధమవుతున్న వేళ.. కాంగ్రెస్, బీజేపీ నుంచి నాయకులు చేరుతుండడంపై బీఆర్ఎస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

–నిజామాబాద్, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)



# బీఆర్ఎస్‌లో చేరికల జోష్!

## యువత చూపు..బీఆర్ఎస్ వైపు



ఏడాదిన్నర కాలంలో కాంగ్రెస్ పాలనతీరు తేటతెల్లమైంది. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అడుగడుగునా మోసాలే తప్ప, ప్రజలకు చేసిందేమీ లేదు. ఇచ్చిన హామీల చిట్టాను అటకెక్కించింది. హామీల అమలులో కనీస శ్రద్ధను కనబర్చడం లేదు. హామీలు అమలుచేయాలని ప్రశ్నించేవారిపై అక్రమంగా కేసులు పెట్టి వేధిస్తున్నారు. ఎన్నికల సమయంలో లేనిపోని హామీలతో నిరుద్యోగ యువతను ఆకట్టుకున్నారు. వారి వెంట తిప్పించుకుని ఇష్టారీతిన ప్రకటనలు చేశారు. ఏడాదిన్నర కాలంలో జాబ్ క్యాలండర్‌ను అమలు చేయలేదు. జాబ్ క్యాలండర్ విధి విధానాలను విడుదల చేసినప్పటికీ అమలుకు మాత్రం చర్యలు తీసుకోవడం లేదు. ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ మినహా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క నోటిఫికేషన్‌ను జారీ చేయలేదు. కేసీఆర్ హయాంలో నోటిఫికేషన్లు ఇచ్చి, దరఖాస్తులు స్వీకరించి, పరీక్షలు రాసిన తర్వాత వాటి ఫలితాలను అనివార్యంగా విడుదల చేసి వారికి నియామక పత్రాలను కాంగ్రెస్ ప్రభుత్వం అందించింది. ఈ నియామకాలు అన్నింటినీ తమ గొప్పతనంగా సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకుంటూ కాలం గడుపుతున్నారు. కానీ కొత్త నోటిఫికేషన్లపై నోరు విప్పడం లేదు. కాంగ్రెస్ తీరుతో విసిగి వేసారిపోతున్న యువత తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. వారంతా తిరిగి కేసీఆర్ ప్రభుత్వమే రావాలంటూ కోరుకుంటున్నారు. బీఆర్ఎస్ పాలనే బాగుందంటూ ఒక్కటై నినదిస్తున్నారు. వారంతా బీఆర్ఎస్ వైపే చూస్తున్నారు. కేసీఆర్‌కు జై కొట్టేందుకు సిద్ధమయ్యారు. గులాబీ జెండానే తెలంగాణకు రక్షణ అని ఎలుగెత్తి చాటుతున్నారు.

### అధికార పార్టీల తీరు నచ్చక..

- ఉమ్మడి జిల్లాలో వలసల జోరు
- అధికార పార్టీ నుంచి బయటికి వస్తున్న శ్రేణులు
- కాంగ్రెస్‌లో ఇమడలేక కారెక్కేందుకు సిద్ధంగా నేతలు
- కేసీఆర్‌కు జై కొడుతున్న కాంగ్రెస్, బీజేపీ నాయకులు
- గులాబీ కండువా కప్పుకునేందుకు యువత ఆసక్తి
- రజతోత్సవ వేళ బీఆర్ఎస్‌లో సరికొత్త ఉత్సాహం..

గులాబీ పార్టీలోకి చేరికలు జోరుగా కొనసాగుతున్నాయి. ఇతర పార్టీల నుంచి కాకుండా తటస్థ వ్యక్తులు సైతం బీఆర్ఎస్‌లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. తాజాగా ఎమ్మెల్సీ కవిత, మాజీ మంత్రి వేముల సమక్షంలో వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్యే బిగాల గణే శ్ గుప్తా ఆధ్వర్యంలో మైనార్టీ యువకులు పెద్ద ఎత్తున గులాబీ కండువాలు కప్పుకున్నారు. మరోవైపు ఎన్నికలకు ముందు బీజేపీ నుంచి భారీగా బీఆర్ఎస్‌లోకి వలసలు కొనసాగాయి. ప్రస్తుతం బీజేపీ ఎంపీఅర్వింద్ తీరు నచ్చక చాలా మంది పార్టీ వీడేందుకు సిద్ధంగా ఉన్నారు. వీరంతా బీఆర్ఎస్ కండువా కప్పుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. వలసల జోరుతో కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ నేతలంతా బేజారవుతున్నారు. అధికార పార్టీలను వీడి ప్రతిపక్ష పార్టీలోకి చేరికలు కొనసాగుతుండడంతో కంగు తింటున్నారు. బీఆర్ఎస్ చేరికల జోరును పరిశీలిస్తున్న కాంగ్రెస్, బీజేపీ రాష్ట్ర నాయకత్వం ఈ మధ్యే ఇరు పార్టీలకు చెందిన జిల్లా స్థాయి నేతలకు క్లాస్ పీకినట్లు తెలిసింది. స్థానిక ఎన్నికలకు సమయం ఆసన్నమైన వేళ.. బీఆర్ఎస్‌లోకి వలసలు కొనసాగడంపై ఏం చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. మొత్తానికి బీఆర్ఎస్‌లో చేరికల పర్వం ఒక్కసారిగా జాతీయ పార్టీలకు ముచ్చెమటలను తెప్పిస్తున్నది. గులాబీ పార్టీలో నయా జోష్‌ను నింపుతున్నది. రజతోత్సవ సంబురాన్ని నిర్వహించుకుంటున్న బీఆర్ఎస్ పార్టీకి కొత్త ఉత్తేజాన్ని అందిస్తున్నది.

# మన్నించండి..

## త్వరలోనే రైతుభరోసా వేస్తాం!

- మార్చి 31లోపు వేస్తామనుకున్నాం ..ఆలస్యమైంది
- రైతు మహోత్సవంలో వ్యవసాయ మంత్రి తుమ్మల
- గన్నీ సంచుల కొరత ఎదురైతే అధికారులను సస్పెండ్ చేస్తా..
- పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి హెచ్చరిక



కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్, ఎమ్మెల్యేలు పోచారం, భూపతిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ధన్‌పాల్, సలహాదారు షబ్బీర్

నిజామాబాద్, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): 'మమ్మల్ని మీరు(రైతులు) మన్నించాలి. మార్చి 31 లోపు రైతు భరోసా వేస్తామని అనుకున్నాం. మేం అనుకున్నది ఆలస్యం అయ్యింది. తప్పకుండా అతి త్వరలోనే మిగిలిన రైతుభరోసా మీ ఖాతాల్లో జమ చేస్తాం..' అంటూ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో సోమవారం ఏర్పాటు చేసిన రైతు మహోత్సవం కార్యక్రమాన్ని మంత్రులు జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వర్ రావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ ప్రారంభించారు. అనంతరం మంత్రులు మాట్లాడారు. మార్చి 31లోపు రైతుభరోసా వేస్తామని ప్రకటించి నవ్వుల పాలైన మంత్రులు ఇప్పుడు ధాన్యం కోతకు వచ్చిన సమయంలో రైతుభరోసా వేస్తామంటూ మరోసారి ప్రకటించారు. తుమ్మల మాట్లాడుతూ.. కుటుంబం అన్నాక కష్టాలుంటాయని, కష్ట కాలంలో, కరువు కాలంలో ఇంట్లో పెళ్లి చేస్తే ఎంత బాధ ఉంటుందో అలాంటిదే రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని చెప్పారు. అయినా సరే రూ.33వేల కోట్లను ఒకే ఏడాది రైతుల జేబుల్లోకి పంపించామంటూ చెప్పారు. పంట నష్టాన్ని త్వరలోనే రైతుల ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు.తక్కువ నీళ్లు పెడితే ఎక్కువ దిగుబడి వస్తుందని, ఆఫ్ అండ్ ఆన్ పద్ధతిలో నిజాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు రైతులు భారీగా దిగుబడి సాధించి ఘనత సాధించారన్నారు. మూడునాలుగేండ్లలో ఆయిల్ పాం కంపెనీలు వస్తాయని, వరి పంట సాగు కాకుండా ఆయిల్ పాం వైపు రైతులు దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. పసుపు బోర్డుతో రైతులకు లాభం జరిగేలా కేంద్ర సహకారంతో అనుబంధ రంగాలను ప్రోత్సాహిస్తామని తుమ్మల చెప్పారు. పసుపు రైతుల ఆకాంక్షలను నెరవేర్చేందుకు పసుపు బోర్డు కృషి చేయాలని సూచించారు. పసుపు బోర్డును పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ప్రధాని, కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు.

### గన్నీ సంచుల కొరత వస్తే అధికారులను సస్పెండ్ చేస్తా...

**ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

గన్నీ సంచుల కొరత ఉండడానికి వీల్లేదని పౌరసరఫరాలు, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నా రు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సస్పెండ్ చేస్తానంటూ హెచ్చరించారు. గన్నీ సంచుల కొరత ఉంటే 24గంటల్లో చర్యలు చేపడతామన్నారు. నిజాంసాగర్, ఎస్సారెస్పీలో పూర్తి స్థాయిలో పూడిక తీత చేస్తామన్నారు. ఈ నెలాఖరులోపు టెండర్ పిలుస్తామని, లక్షల ఎకరాలకు, అదనపు ఆయకట్టుకు నీరు పారే విధంగా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ప్యాకేజీ –20, 21, 22, గుత్ప లిఫ్ట్ ఇరిగేషన్ పనుల్లో పెండింగ్ పనులు పూర్తి చేస్తామన్నారు. ఇరిగేషన్ విషయంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టును సాగులోకి వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. యాసంగిలో 57లక్షల ఎకరాల్లో 127.50లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం పండిందన్నారు. చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తామన్నారు. లోపాలుంటే నేరుగా తనకు చెప్పాలని, చర్యలు తీసుకుంటానని అన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారులు పోచారం శ్రీనివాస రెడ్డి, షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీలు మహేశ్‌కుమార్ గౌడ్, అంజి రెడ్డి(బీజేపీ), కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, భూపతి రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, రాకేశ్ రెడ్డి, పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, రైతు కమిషన్ మెంబర్ గడుగు గంగాధర్ పాల్గొన్నారు.

### ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి

రైతు మహోత్సవంలో సౌకర్యాల కల్పనలో ప్రభుత్వ అధికారులు వైఫల్యం చెందినట్లుగా స్పష్టంగా కనిపించింది. రైతులను వ్యవసాయ శాఖ భారీగా సమీకరించింది. కానీ వారికి సరైన వసతులు కల్పించలేదు. ఎండ వేడిమితో ఉక్కపోతకు గురై ఉక్కిరిబిక్కిరికి గురయ్యారు. రైతులంతా వేడి గాలికి సైతం తీవ్రంగా ఇక్కట్లు ఎదుర్కొన్నారు. చాలా మంది వేడిని తట్టుకోలేక సభా వేదిక నుంచి బయటికి వచ్చేశారు.



### ఎమ్మెల్యేల సంవాదం...

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గన్నీ సంచులు లేవని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి సభలో మాట్లాడుతూ మంత్రుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. అసౌకర్యాలు వేధిస్తున్నాయంటూ చెప్పారు. ఆ తర్వాత పైడి రాకేశ్ రెడ్డి మాటలకు కౌంటర్ ఇచ్చేందుకు ఎమ్మెల్యే భూపతి రెడ్డి ప్రయత్నించారు. ధాన్యం కొనుగోళ్లు సవ్యంగానే జరుగుతున్నట్లుగా చెప్పుకొచ్చారు. ఆర్మూర్ ఎమ్మెల్యే చెప్పినట్లుగా ఇక్కట్లు ఏమీ లేవన్నారు. పౌరసరఫరాల శాఖ మంత్రి దృష్టికి సమస్యలను తీసుకెళ్తే కాంగ్రెస్ ఎమ్మెల్యే స్పందించడం ఏమిటంటూ వేదికపై మంత్రులతో ఆర్మూర్ ఎమ్మెల్యే సంవాదం పెట్టుకున్నారు. ఈ పరిణామాలను రైతులంతా ఆసక్తిగా గమనించారు. ఎమ్మెల్యేల తీరుపై చర్చించుకున్నారు.

# రజతోత్సవ సభకు ప్రజలు భారీగా తరలిరావాలి

**మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్**

నస్రుల్లాబాద్/రుద్రూర్/కోటగిరి, ఏప్రిల్ 21: వరంగల్ జిల్లాలో ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ప్రజలు భారీ సంఖ్యలో తరలిరావాలని రూరల్ మాజీ ఎమ్మెలే బాజిరెడ్డి గోవర్ధన్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన నస్రుల్లాబాద్, రుద్రూర్ మండలాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. రజతోత్సవ సభకు పెద్ద సంఖ్యలో కార్యకర్తలను సమీకరించాలని నాయకులకు సూచించారు. సభను విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. సమావేశాల్లో బాన్సువాడ మాజీ మున్సిపల్ చైర్మన్ జుబేర్, నాయకులు గణేశ్, నర్సింహులు గౌడ్,సాయిలు,అఫ్రోజ్, పోశెట్టి, లక్ష్మణ్, షఫి, శంకర్, మధు, డౌర్ సాయిలు, ఎంజీ గంగారాం, జువ్వల తదితరులు పాల్గొన్నారు.

**ప్రజలను మోసం చేసిన రేవంత్ సర్కార్**

అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన రేవంత్ సర్కార్ ప్రజలను మోసం చేసిందని బాజిరెడ్డి మండిపడ్డారు. ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కేశాడన్నారు. సోమవారం ఆయన కోటగిరిలో ఎంపీపీ మోరే సులోచన కిషన్‌ను పరామర్శించారు.అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజలకు ఆరు గ్యారెంటీలు అమలుచేస్తామని చెప్పి, మోసం చేసిన రేవంత్ సర్కారుకు రాబోవు రోజుల్లో ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ప్రజలు చాలా తెలివిగల వారని, అన్నీ గమనిస్తున్నారని అన్నారు. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అధికారం ఎటుంటే అటువైపు ఉంటాడని విమర్శించారు. రాబోవు రోజుల్లో బాన్సువాడలో ఉప ఎన్నికలు రావడం ఖాయమని, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి లక్ష మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు. బాజిరెడ్డి వెంట మాజీ ఎంపీపీ మోరే సులోచన కిషన్, ఎత్తొండ మాజీ ఉప సర్పంచ్ సుజాత దేవేందర్, మాజీ ఎంపీటీసీ ఫారుక్, మండల నాయకులు ఉన్నారు.



నస్రుల్లాబాద్‌లో బీఆర్ఎస్ కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్



దోమకొండలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

# 'వరంగల్ సభ'ను విజయవంతం చేయాలి

**మాజీ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్**

కామారెడ్డి/బీబీపేట(దోమకొండ), ఏప్రిల్ 21 : వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని మాజీ ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ పిలుపునిచ్చారు. కామారెడ్డి జిల్లాకేంద్రంతోపాటు దోమకొండలో సోమవారం ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ కార్యకర్తల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ, ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి నిర్వహించనున్న రజతోత్సవ సభకు ప్రతి కార్యకర్త హాజరుకావాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను గాలికి వదిలి, కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. హామీలు అమలు చేతకాక ప్రతిపక్షాలపై నోరుపారేసుకుంటున్నాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. రూ. 2 లక్షల వరకు వందశాతం రైతులకు రుణమాఫీ చేసినట్లు నిరూపిస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ హయాంలో సంతోషంగా ఉన్న ప్రజలు, రైతులు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజా సంక్షేమ పథకాల అమలులో మాజీ సీఎం కేసీఆర్ దేశానికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. రైతు రుణమాఫీ, రైతుభరోసా అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి విఫలమైందని విమర్శించారు. నియోజకవర్గం నుంచి మూడు వేల మంది కార్యకర్తలు తరలిరావాలని కోరారు. సమావేశాల్లో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్‌కుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పిప్పిరి ఆంజనేయులు, బలవంత్‌రావు, గంధ్ర మధుసూదన్‌రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ గోపీగౌడ్, కే.శేఖర్, సింగిల్ విండో చైర్మన్ నల్లవెల్లి అశోక్,వైస్ చైర్మన్ రమేశ్, పార్టీ నాయకులు జూకంటి మోహన్ రెడ్డి, గూడెం బాల్‌రాజ్, కమలాకర్ రావు, మాజీ ఎంపీపీలు పాల్గొన్నారు.

# అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలి

- మాజీ జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్
- నిరసన దీక్షకు మద్దతు



దీక్షా శిబిరం వద్ద మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్

డిచ్‌పల్లి, ఏప్రిల్ 21: యూనివర్సిటీల్లో రెగ్యులర్ ప్రొఫెసర్లతో సమానంగా విద్యార్థులు విద్యాబుద్ధులు నేర్పిస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలని మాజీ జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా టీయూలో నిరసన దీక్షలు చేపట్టిన కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లకు బాజిరెడ్డి జగన్ సోమవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్సిటీల్లో కొన్నేండ్లుగా కాంట్రాక్ట్ పద్ధతిపై పని చేస్తున్న వారికి న్యాయం చేయకుండా ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల భర్తీకి మార్గదర్శకాలు జారీ చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పున ప్రభుత్వం అమలు చేయాలని కోరారు.యూజీసీ నిబంధనల ప్రకారం అన్ని రకాల అర్హతలున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను ముందుగా రెగ్యులర్ చేసి అనంతరం మిగిలిన ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో కాంట్రాక్ట్ లెక్చరర్లుగా పని చేస్తున్న వారిని రెగ్యులరైజ్ చేసిన విధంగానే వర్సిటీల్లో పని చేస్తున్న వారిని రెగ్యులరైజ్ చేయాలన్నారు. కాంట్రాక్ట్ అధ్యాపకులకు అండగా ఉంటామన్నారు.

# ఏసీబీకి చిక్కిన పంచాయతీరాజ్ సీనియర్ అసిస్టెంట్

- బిల్లు మంజూరుకు రూ.7,500 లంచం డిమాండ్
- ఆర్మూర్‌లో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్ 21: ఆర్మూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఏసీబీ అధికారుల దాడి కలకలం రేపింది. ఓ కాంట్రాక్టర్ నుంచి రూ.7,500 లంచం తీసుకుంటూ పంచాయతీరాజ్‌శాఖ సీనియర్ అసిస్టెంట్ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఆర్మూర్ మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీరాజ్ శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాస్ శర్మ నందిపేట్ మండలం డొంకేశ్వర్ గ్రామంలో సీసీ రోడ్డు పనులకు సంబంధించిన రూ.4.75లక్షల బిల్లును ఓ కాంట్రాక్టర్‌కు మంజూరుచేయాల్సి ఉన్నది. అయితే బిల్లు మంజూరు చేయాలంటే సదరు కాంట్రాక్టర్‌ను రూ.7.500 లంచం డిమాండ్ చేశాడు. దీంతో లంచం ఇవ్వడానికి ఇష్టపడని కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. సదరు కాంట్రాక్టర్ సోమవారం కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ శర్మకు రూ.7,500 ఇస్తుండగా, అప్పటికే అక్కడికి చేరుకున్న ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిబంధనల మేరకు కాంట్రాక్టర్ పేరును తాము వెల్లడించబోమని ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ తెలిపారు. విచారణ పూర్తయిన అనంతరం హైదరాబాద్ నాంపల్లి కోర్టుకు సదరు ఉద్యోగిని తీసుకువెళ్తామని చెప్పారు.



ఏసీబీ అధికారులకు పట్టుబడిన పంచాయతీరాజ్ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ శర్మ